# సత్యం మాష్టారు

— చావా శివకోటి

''అన్నాయ్! 'లేచి పోవడమంటే ఏంట్రా?' వాళ్లేమో చచ్చిపోతే ఏడ్చినట్లు ఏడుస్తున్నారాయె'' అడిగాడు అన్నయ్యను.

వడివడిగా నడుస్తూనే 'గుర్రు'గా చూశాడు. అమ్మను నాన్న చూసినట్లు.

'ఏంది వో నీ బడాయి' అనుకుని ఆపాను. ''ఏంట్రా?'' అని.

చాచి నా చెంప పగలేలా కొట్టి, అందకుండా పరుగెత్తాడు వెధవ.

చెంప చురుక్కుమంది. రెండు మూడు ఏళ్లు అచ్చుపడినట్లు అనిపించింది. చేత్తో నెమ్మదిగా నెమరుకొని నడుస్తుంటే, మంచినీళ్లు కావిడి మోసే రంగయ్య తాత కావిడి భుజాన మోస్తూనే ఎదురయ్యాడు.

''బడికి ఎగనాం పెట్టి నట్టుంది మనవడా!'' అన్నాడు నన్ను చూసి.

''అదేం లేదు గానీ తాతా, 'లేచి పోవడమంటే అర్ధమేమిటో చెప్పు'' అనడిగాను.

''అంటే''

భుజాన ఉన్న నీటి కావిడిని కింద పడవేసి, రాక్షసుడిలా నవ్వాడు.

ఆ నవ్వుకు వాని ఒంట్లోని ప్రతి భాగమూ చిత్రంగా కదిలింది.

రా నీ నువ్వు తగలడ. అది నవ్వా!? ఉరుములూ, పిడుగులూ లా ఉంది. భయమైంది. అతణ్ణి దాటి వేగంగా నడిచాను.

అలా, ఇంటి ముందుకు చేరేసరికి నాన్నగారు నన్ను 'నమిలి మింగేసేలా' చూస్తూ కనిపించారు.

ఆయనకు 'లేచి పోవడమంటే' తప్పక తెలిసే ఉంటుంది. కానీ, అప్పుడు అడిగితే, వీపుమీద ఉప్పు రాస్తాడని బితుకు బితుకు మంటూ గోడ వారగా లోనికి వచ్చాను.

అప్పటికే ''నీకా కొంపకాడ ఏం పనిరా ఆడంగి వెధవా?'' అంటూ ఉరికి వచ్చాడు.

నేను పక్కనున్న గడి మంచె కింద దూరాను.

దానికిందకు వంగలేక ఆగాడు.

''మొదట 'శుచి'గా స్నానం చేసి తగలడు'' అని వెళ్లిపోయాడు.

కిక్కురు మనకుండా అలాగే చేశాను.

నాకు మాత్రం అంతా అయోమయంగా అనిపించింది.

ఆ రాత్రి అమ్మ పక్కన చేరి - నెమ్మదిగా అడిగాను.

''వేలెడంత లేవు, ఏం ప్రశ్నరా అది? కళ్లు మూసుకుని పడుకో. అసలే మీ నాన్న కోపంగా ఉన్నారు'' అని గదిమింది.

అట్టాగే కళ్లు గట్టిగా మూసుకున్నా. చాలా సేపటికి నిద్ర పట్టింది.

ఆ తరువాత నాకు మాత్రం ఒక్కటి అర్ధమైంది. 'లేచి పోవడ'మనేది' తప్పుడు పని' అని. అయితే ఆ తప్పు ఏమిటో నా ఊహకు అందలేదు. నాకు చెప్పిన వారూ లేరు.

మా తాతగారి దగ్గర నాకు చనువు ఎక్కువ గదా! పొద్దుట లేవగానే, ఆయన దగ్గర కెళ్లాను.

నేను కనపడగానే దగ్గరకు తీసుకున్నాడు. ఒళ్లో కూర్చోబెట్టుకుని ముద్దెట్టు కున్నాడు ఆప్యాయంగా. ఆనక 'బాగా చదువుతున్నావుగదా!' అనడిగాడు.

తల ఊపాను.

అలాగే కొద్దిసేపు కూర్చుని- తాతయ్యనూ అడిగాను.

'సత్యం మాష్టారు కూతురు గురించట్రా?' అని నవ్వు. 'ఇదిగో చిన్నా! నీకు చెప్పినా అర్ధం గాదులే. వదిలెయ్.' అన్నాడు.

అక్కడనుంచి లేచాను.

దాని అర్థాన్ని ఎలాగైనా తెలుసు కోవాలన్న కోరిక మాత్రం నన్ను వదలడం లేదు. అప్పుడు మా మేనత్త గారు గబుక్కున గుర్తుకొచ్చింది. ఆవిడ పేరు- రాజమ్మ. భర్త పోయాడు. ఊళ్లోనే ఒంటరిగా ఉంటోంది. నేను నెమ్మదిగా రాజమ్మత్త ఇంటికి నడిచాడు.

''పొద్దుటే ఇటు బయలుదేరా వేమిట్రా?'' అంటూ చేయి పట్టుకుని లోనకు తీసుకెళ్లింది. కొబ్బరి లౌజు పెట్టింది. జంతికలు రెండిచ్చింది. అవి తిన్నాక మంచినీ ళ్లు ఇచ్చింది. ఆనక ఒళ్లోకి చేర్చుకుని ''కన్నా! ఏంట్రా బాగా చిక్కిపోయావు? బడికెళ్తున్నావేంటి?'' అని అడిగింది గారాం చేస్తూ.

నా బుగ్గలపై బలంగా ముద్దు పెట్టుకుంది. ఆవిడ నుంచి లేచి మంచం పైన కూర్చుని, నా అనుమానాన్ని ఆవిడనూ అడిగాను.

అంతే.

''ఒరే ఒరే!'' అంటూ దగ్గరకు తీసుకుని నన్ను గట్టిగా అదుముకొని ఉక్కిరి బిక్కిరి చేసింది. అలా చేస్తున్నప్పుడు ఆవిడ ముఖంలో అలవిమాలిన ఆనందం కనిపించింది. 'పిచ్చి సన్నాసి' అంటూ వదిలేసింది.

సమాధానం మాత్రం చెప్పలేదు.

అసలు ఎంతకీ తెలీదేమో అనిపించిందప్పుడు.

వెనక్కి మళ్లాను- చెప్పి.

చాలా దూరం వచ్చాక, చెరుకు గడలూ, పారేసిన వస్తువులూ, తీసుకుని చిద్విలాసంగా నాలుగు నెలలుగా తిరుగుతున్న పిచ్చాడు కనిపించాడు. 'వీణ్ణే అడుగుదాం' అనుకొని 'పిచ్చోడు ఏమన్నా చేస్తాడేమో నన్న' భయం ఉన్నా, ధైర్యం చేసి వాని దగ్గరకు నడిచాను, వాడు నన్ను బెదురుగా చూశాడు - చేతికున్న వాడి చెఱుకుగడ లాక్కుంటానేమో నని.


కొంచెం దూరంగా ఓ గెంతు గెంతి, 'ఈ గెడ నాది. నాకే కావాలి. నీను నేనివ్వ, కావాలంటే కరణంగారి తోట కెళ్లు. ఎవ్వరూ లేరు. బోలెడు తెచ్చుకో. హి.. హి.. హి.. హి... హి ...' అని, 'ఇగో, అక్కడ ఓ బుర్ర మీసాల సోంబేరి ఉన్నాడు. వాడికి దొరక్కు. చూడు, నన్నెలా కొట్టాడో.' అని వీపు చూపాడు. పిర్రల దగ్గర నుంచి ముచ్చిన గుంట దాకా, కర్ర దెబ్బల ఆనవాళ్లు కనిపించి బాధని పించింది. చెరుకు గడ కోసం అట్టా బాదాలా వెధవ అనిపించింది.

''ఇదిగో! నాకు చెరుకుగడ వద్దు. ఇట్రా'' అని పిలిచాను.

''నే రాను. కొడతావేమో?''

## జరిగిన కథ

**సౌర్థక నామధేయుడు అంజనేయులు అతనికో తమ్ముడు. చిన్నప్పుడు స్కూలుకి వెళ్లానంటే నాన్న ఒప్పుకోడు ఎట్టకేలకు సత్యం మాష్టారి వద్ద అతని చదువు ప్రారంభం అవుతుంది. రజాకార్ల దాడిలో సత్యం మాష్టారి కూతురు స్వప్న చెరచబడుతుంది. ఆమె ఎటో వెళ్ళిపోతుంది. అందరూ ఆమె లేచిపోవడం గురించి అనుకొంటుంటే అతని చిన్న బుర్రకు అర్థంకాక తికమకపడుతుంటాడు.**



''అదేం లేదు. ఇట్రా, నా కో మాటకు అర్థం తెలియడం లేదు. నువ్వు బాగా చదువుకున్న వాడివను కుంటున్నారు గదా అంతా. చెబుతావనీ'' అన్నాను బతిమి లాడుతున్నట్లు.

''అట్టాగా, అయితే మనిద్దం దోస్తీ. కచ్చి ఏం హి... హి... హి... '' అన్నాడు ఆగి.

''లేచి పోవడ మంటే అర్థమేమిటి?'' అన్నాను దగ్గరకు జరిగి. ఇక చెప్పు అన్నట్లు - అతగాడిని చూస్తూ.

విన్నాడు.

మారు మాటాడ లేదు.

పెద్దగా ఏడవ బోయాడు.

కొద్ది దూరం జరిగి సిగ్గు పడ్డాడు.

ఏవేవో పిచ్చి సైగలు చేస్తూ కనపడకుండా పరుగెత్తాడు.

ఇక లాభం లేదని ఇంటివైపు నడిచాను.

నేను ఇంట మంచ మెక్కేసరికి, నాన్న గారి మాటలు వినిపించినయ్.

ఆ మర్నాడూ అలవాటు ప్రకారం బడిదాకా వెళ్లాను.

మాష్టారు ఇంటికి తాళం వేసి ఉంది.

ఎక్కడికెళ్లాడో? అర్థం కాలేదు. తల దించుకుని సీదా ఇంటికి చేరాను.

''ఎక్కడికెళ్లావురా?'' అడిగింది అమ్మ.

''బడికి'' అన్నాను.

''అక్కర లేదు'' అంది.

''ఏం?'' అన్నట్లుగా చూశాను- అమ్మను.

ఏమీ చెప్పకనే లోనికెళ్లింది.

ఆ మర్నాడు నారాయణ కనిపించాడు. వాణ్ణే అడిగాను.


''మాష్టారేరి నారాయణా? ఇంటికి తాళం వేసి ఉందేమిటి?'' అని.

''స్వప్నక్కను రజాకార్లు చెడిపారుట. ఆవిడేమో చెడి ఇంటికి రాలేక, ఎవరి వెంటో వెళ్లిపోయిందట. కూతురుకు ఇట్టా జరిగింది గదా! ఇక్కడ జనానికి ముఖం చూపించలేక ఆయన రాత్రికి రాత్రి ఇల్లు వదిలి వెళ్లిపోయాడుట'' అని చెప్పాడు.

''లేచి పోవడం అనేది అంత తప్పుడు పనా నారాయణా?'' అడిగాను.

''ఏం ప్రశ్నరా ఇదీ! ఇంకెవర్నన్నా అడిగేవు డొక్క చీరేస్తారు. ఛ'' అనుకుంటూ పోయాడు నారాయణ.

తెలియని దేదైనా తెలుసుకోవడం మంచిదం




టారు అంతా. కానీ, ఎవ్వరూ చెప్పరేం? ఇట్టాంటివి తెలుసుకొన కూడదా? అదయినా చెప్పవచ్చు గదా! ఏది ఎట్టా గయితేం. ఇది నాకు మరో రెండేళ్ల వరకూ ప్రశ్న గానే మిగిలింది. సత్యం మాష్టార్ని మాత్రం మరువలేక పోయాను.

స్వప్న అంతే. మరి ఆ పిల్ల గుర్తుకొస్తే చాలు. ఏ దేవతో అలా మెదిలేది. మనసంతా హాయిగా అనిపించేది. ఒక్కసారి స్వప్న కనిపిస్తే బాగు. అని ఎన్నిసార్లు అనుకున్నానో. మరీ, మాష్టారు పాఠం చెపే తీరు. అవసరమైనప్పుడు 'గదమడం', నవ్వించడం కథలు చెప్పడం, ఎప్పుడూ గుర్తు నుంచి విడిపోలేదు. అవతల బజారుకు ఎప్పుడు వెళ్లాల్సి వచ్చినా, ఆ ఇంటివైపు ఆగి చూడకుండా వచ్చే వాణ్ణే కాదు. పైగా ఆయనగానీ వచ్చాడేమో నని అడగబుద్దేసేది. కానీ ఆ అక్కర రాలేదు. ఆ ఇంటికి వేసిన తాళం కప్పకు.

దాదాపు నాలుగేళ్ల దాకా తీయనే లేదు.

ఒకనాడు తాళం తీసి కనిపిస్తే ఆరాటంగా వెళ్లాను. 'మాష్టారూ!' అంటూ.

లోన ఉన్న వాళ్లు నన్ను ఎగాదిగా చూశారు. ''మాష్టా రెవరు?'' అనడిగారు.

''మా సత్యం మాష్టారు గానీ వచ్చారేమోననీ'' అని వెనక్కి మళ్లాను. ఏ తప్పూ చేయక శిక్ష అనుభవించిన మాష్టారు- మళ్లీ కనిపిస్తాడా?' అనిపించింది. కళ్లలో నీరింకింది.

❁❁❁

**మ**రో ప్రైవేటు బడిలేని కారణాన, మా తాత గారు నన్నూ- సర్కారు బళ్లోనే చేర్చారు.

నేను తీస్రీ పూర్తి చేశాను. (మూడో తరగతి.)

1944 అనుకుంటాను.

అటు ప్రపంచ యుద్ధ ముగింపు దశ.

ఇక్కడ స్వతంత్ర పోరాటం.

తెలంగాణ నైజాముకు వ్యతిరేకంగా పోరాట నిర్ణయం.

మరో వైపున బెంగాల్‌లో కరవు.

దాదాపు యాభై లక్షల మందిని పొట్టన పెట్టుకుంది.

మొత్తం ప్రపంచం పుట్టాకనే అదో అతి భయంకరమైన కాలం.

ఏ ఏలికా, పాలకులూ పట్టించుకోని కాలం.

మనుషులిలా చస్తుంటే, వార్ని వదిలి స్వాతంత్ర్య పోరాటమేంటీ అన్నవారూ ఉన్న కాలం. అన్నార్తులు, అనాధలుండని కాలం కోసం పరితపించి, ఆదుకొన గలిగే చైతన్యం ఇంకా అంతగా లేని కాలం.

> **తెలియనిదేదైనా తెలుసుకోవడం మంచిదంటారు అంతా. కానీ, ఎవ్వరూ చెప్పరేం? ఇట్టాంటివి తెలుసుకొనకూడదా? అదయినా చెప్పవచ్చు గదా! ఏది ఎట్టా గయితేం. ఇది నాకు మరో రెండేళ్ల వరకూ ప్రశ్నగానే మిగిలింది.**

అయితే నేనూ ఇంకొందరం విద్యార్థులం కలిసి బెంగాల్‌లో కరవు నిధులకై చిన్న వాళ్లమైనా జోలె పట్టి ఊళ్ల వెంట పడ్డాం.

దాదాపు ఇరవై రోజులు తిరిగాం. దుస్తులూ, బియ్యం, డబ్బూ, మేం అనుకున్న దానికంటే ఎక్కువగానే వసూలు అయింది. ఇంకో రెండు రోజులు తిరిగి అప్పటికి ఆగుదామనుకున్నాం. ప్రజలు చాలా ఉదారంగా ప్రవర్తించారు,

ఆ రోజు చాల పెద్దవాళ్లని కలిశాం. ఎక్కువగానే ఇచ్చారు.

ఆ మరునాడు పోగైన దాన్ని ఒక్కచోట చేర్చి బాధితులకు చేర్చాలనుకున్నాం.

తెల్లవారింది.

మా నారాయణ సత్రం గదిలో ఉన్నాడు. అక్కడకు వెళ్లాను. తోవలో ఇంకా ఇద్దరు పెద్దల్ని కలిశాం. ఇవ్వాల్టితో మా యాచన ఆపుతున్నామని చెప్పి సెలవు తీసుకున్నాం. అప్పటికి భోజనం వేళయింది. హోటలులో ఇంత తిని, సత్రం వద్దకు బయలు దేరాం. సత్రానికి చేరువ అవుతుండగా, ఓ గుంపు ఆగి, మధ్య నున్న దాన్ని చూస్తూ కనిపించింది. 'ఏమిటో చూద్దాం' అని మేమూ దూరాం. నేను ఇంకొంచెం లోనికెళ్లాను. అక్కడో అనాథ శవం ఉంది.

'ఎవరో పాపం' అనుకుని వెనక్కు మళ్లబోయాను.

ఏదో గుర్తుకు వచ్చింది.

ఆగాను.

పరీక్షగా చూశాను.

గుర్తు కొచ్చింది. అవును. అవును. ఆయనే. అనుకున్నాను.

నా కాళ్లూ చేతులూ చలువలు కమ్మినయ్. పడిపోతానేమో ననిపించింది.

నిలదొక్కు కున్నాను బలవంతంగా. నా కళ్లనుంచి నీరుబికింది.

ఓ నిముషం తరువాత 'మాష్టారూ, సత్యం మాష్టారూ' అన్న మాటలు- నా నోటి వెంట బయట కొచ్చాయి. నెమ్మదిగా శక్తిని కూడదీసుకుని 'శవం' దాకా అడుగులు వేశాను. నన్ను అక్కడి దాకా నడవనీయకుండా పక్కనున్న వాళ్లు ఆపే యత్నం చేశారు. కానీ, నేను ఆగలేదు. మరీ దాపుకు వెళ్లి బాగా చూశాను. అవును. అది సత్యం మాష్టారే!

అంతే....

అక్కడే ఆయన పాదాల వద్ద చతికిల పడిపోయాను. పెద్దగా ఏడ్చాను కూడా. 'మాష్టారూ ఏమిటిది?' అంటూ. ఇంతలో నా మిత్రులు కూడా నన్ను చూసి నా చుట్టూ పోగయ్యారు. వచ్చిన వారిలో 'రమణ' అన్నవాడు మాష్టారుని గుర్తించి 'సత్యం మాష్టారూ!' అంటూ కుప్పకూలి పోయాడు. వాడి ముఖాన నీళ్లు చల్లి, సేద దీర్చారు మిత్రులు. నేను ఏడుస్తూనే మాష్టారి ఇల్లా లెక్కడైనా కనిపిస్తుందేమో నని వెతికాను. వెతుకుతూనే ఆవిడేరీ? అని పిచ్చోడిలా అడిగాను. అనాథ శవాన్ని చూసేందుకు వచ్చిన జనానికి ఆవిడేం తెలుస్తుంది నా చాదస్తంగానీ.

అయితే ఎవరు? ఎవరు కావాలి? అని గుచ్చి నలుగురైదుగురు గుంపు నుంచి అడిగారు.

''మా మాష్టారాయన. ఈయన భార్య వుండాలి గదా!'' అన్నాను.

ఎవరి నోటివెంటా సమాధానం రాలేదు. ఒకర్నొకరు చూసుకోవడం తప్ప.

ఆ తరువాత ఒక్కొక్కరూ వెళ్లిపోసాగారు.

ఓ అరగంట గడిచేసరికి ఎక్కువ భాగం జనం అక్కడ లేరు.

ఇంకొంచెం సేపటికి ఎవ్వరూ మిగలరనిపించి - దుఃఖం మళ్లా ముంచుకొచ్చింది.

అంటే, మాష్టారి 'శవం' మున్సిపాలిటీ వాళ్ల పాల పడుతుందన్న మాట!

ఆవేదనా, భయమూ, ఏడుపూ నన్ను మరి ఎలానో చేశాయి. నిగ్రహించుకుని, చుట్టూరా మిగిలి ఉన్న వారితో, ''ఈయన దహన సంస్కారం చేయాలి రా! ఎలా?'' అని అడిగాను- కళ్లు వొత్తుకుంటూ.

నన్ను పిచ్చి పోరణ్ణి చూసినట్లు చూసి ఉన్న కొద్ది మందీ వెనుదిరిగారు.

ఈ పీడ వాళ్లపై పడుతుందేమో నన్న జంకు కలిగి చివరకు నేనూ, నా మిత్రులూ మిగిలాం.

మాలో ఎవ్వరికీ పదమూడేళ్లకు మించి లేవు.

చూస్తూ పోయేం వాళ్లు కూడా, మమ్మల్ని అదోలా చూసి వెళ్తున్నారు. ఒక్కొక్కడూ ఆగి, బేడ, అర్థ, అణా శవంపై విసురుతున్నారు. అది మరీ భరించ రానిదిగా అనిపించింది నాకు.

'ఏది ఏమైనా, మాష్టారి దహన సంస్కారం సవ్యంగా పూర్తిచేయాలి'- అనే నిర్ణయానికి వచ్చాను.

అయితే- అంత పైకం ఎలా?

నా దగ్గర- పదహారణా మినహా లేవు.

ఇంటి దగ్గర, నేను దాచుకునే 'గురిణి'లో మాత్రం ఇరవై రూపాయల పైనే దొరుకుతాయి. నాన్న అణా కూడా ఇవ్వడు. పైగా అక్కడికెళ్లాక, ఇక్కడకు తిరిగి రానివ్వక పోవచ్చు. తాతగారు కనిపిస్తే, డబ్బు ఇస్తాడు. కానీ, పొరుగూరున ఉన్న తాతగారు కలవడం ఎలా? ఇట్లా తల నిండా ప్రశ్నలు. అయోమయం దుఃఖం ఢిగలోడు తున్నది. నారాయణ వచ్చి చేరాడింతలో. రమణ నా పక్కనే ఉన్నాడు- కళ్లు తుడుచుకుంటూ. మిగిలిన మిత్రులు ఏమీ పాలుపోక నిల్చుని ఉన్నారు.

''అరే! రమణా నీ దగ్గర డబ్బు ఎంత ఉంది?'' అడిగాను.

వాడు నిక్కరు జేబు నుంచి ఉన్న వరకూ తీశాడు. పది రూపాయల పావలా ఉంది. నా జేబులో ఉన్నవి తీశాను. ఇది చూసి, నారాయణ వాని దగ్గర ఉన్న ఆరు రూపాయలూ ఇచ్చాడు. ఆనక నా మిత్ర బృందం వైపు తిరిగాను. వాళ్లు ఏమనుకున్నారో ఏమో గానీ అయిదారుగురు తమ దగ్గర ఉన్నదంతా నా జేబులో ఉంచారు. మొత్తం అరవై ఒక్క రూపాయిలు అయింది. 'ఇంకా ఇరవై రూపాయలుంటే గానీ - సరిపోదు.' అన్నాడక్కడున్న ఓ పెద్దాయన.

ఎవర్ని అడగాలో అర్థం కాలేదు.

అయితే - రమణ మాత్రం ''అరే శివా! మనం వసూలు చేసిన పైకం ఉందిగదా! దాన్లో నుంచి తీసి వాడుదాం. ఊళ్లో కెళ్లాక మన వస్తువులు ఏవో ఒకటి అమ్మి భర్తీ చేద్దాం'' అన్నాడు


నేను నా మిత్ర బృందం వైపు చూశాను.

వాళ్లు 'సరే' అన్నారు.

మరో నలభై రూపాయలు తీసి ఇచ్చారు.

'శవ' యాత్ర ప్రారంభమయ్యే సరికి అక్కడే రాత్రయింది.

శవ దహనం పూర్తయ్యే సరికి అర్ధరాత్రి అయింది.




శ్మశానం నుంచి తిరిగి వస్తుంటే స్వప్న మనసులో మెదిలింది.

ఈ తల్లీ, బిడ్డ ఏమైనారు? అనిపించి మనస్సంతా వికలమైంది.

సత్రంలో కొచ్చి కూర్చున్నాక మనస్సంతా తెల్ల కాగితంలా - అనిపించింది.

తెలుపుదనం అతడి చిన్న మరకనూ ఇముడ్చు కోలేదు.

తన స్వచ్ఛతకు తను మాత్రమే సాటి- అనిపించింది.

''వేలిడంత లేని వెధవలు చేయాల్సిన పనులా ఇవి. వీటివల్ల జరిగే అరిష్టాన్ని కుటుంబమంతా భరించాల్సి వస్తుందిగదా, ఏ ధైర్యంతో ఇలా చేసినట్లు? తోచింది చేయడమేనా?''

సత్యం మాష్టారు ఆ స్వచ్ఛతకు మరో రూపు.

విధి చేత ఆటబొమ్మ అయినాడు.

కొన్ని జీవితాలిలా ఎందుకు అవుతాయో. ఎంత తలుచుకున్నా అర్థమవుదు. మనస్సులోనే నమస్కరించుకున్నాను.

కానీ, అంత మంచి మనిషి బతుకు ఇలా ముగియడమే- నాకెంతకూ కొరుకుడు పడనిదిగా మిగిలింది.

ఆ మర్నాడు ఇంటికి చేరాను.

బెంగాలు కరవుకోసం వసూలుచేసిన వాటిలో తీసిన పైకం ఆ సాయంత్రాని కల్లా జమ చేశాం.

అయితే,

నేను నిర్వహించిన ఈ నిర్వాకం నాన్నగారికి చేరింది.

ఆ రాత్రి ఇంటికి చేరే సరికి చిందులు వేస్తున్నాడు.

''వేలిడంత లేని వెధవలు చేయాల్సిన పనులా ఇవి. వీటివల్ల జరిగే అరిష్టాన్ని కుటుంబమంతా భరించాల్సి వస్తుందిగదా, ఏ ధైర్యంతో ఇలా చేసినట్లు? తోచింది చేయడమేనా?''

నేను గడపలోనే ఆగాను.

'నాన్న' నాకు కనిపిస్తూనే ఉన్నాడు.

ఆయన వెనకే అమ్మ. పైట చెరగుతో కళ్ళు తుడుచుకుంటూ కనిపించింది.

ఇంట్లోకి వెళ్లాలని అనిపించలేదు నాకు.

ఒకవేళ తాతగారు కనిపిస్తే వెళ్లే వాడినేమో?

ఆయన జాడ మాత్రం అక్కడ లేదు.

నా వెనుకే ఇంటి దాకా వచ్చిన నారాయణ నాన్న అవతారాన్ని గమనించి ఎప్పుడు జారుకున్నాడో అర్థం కాలేదు.

ఒంటరిగా మిగిలాను.

''గడపలో అడుగు పెట్టకు. మేం చచ్చామని తల కొరివి పెట్టొచ్చావా? అసలు నిన్ను నువ్వు ఏమనుకుంటున్నావు?'' అని పెద్దగా అరుస్తున్నాడు. నేను కనిపించాక 'శివాలు' ఇంకా పెరిగినయ్.

ఆ క్షణాన!

సత్యం మాష్టారు! ఎప్పుడూ మననం చేసుకునే 'శ్లోకం' గుర్తుకొచ్చింది.

'అవ్యక్తా దాని భూతాని! వ్యక్త మధ్యాని భారతా! అవ్యక్త విధినాన్యేవ! కాతత్ర పరి లేదనా?'

'ప్రాణి కోటి విషయాన పుట్టుకకు ముందేమిటో తెలీదు. మరణం తరువాత ఏమిటోకూడా తెలీదు. ఈ మధ్య ఎంతోకొంత తెల్సినట్లని పిస్తుంది. కనుక, దాని కోసం దుఃఖించడం అనవసరం' అని.

నాన్నవైపు ఒక్కసారి చూశాను. ఆయన వెనుక 'అమ్మ' ఉంది. ఇద్దరికీ నమస్కరించాను. వెనక్కు మళ్లాను. నడక మొదలైంది!